యాంత్రీకరుణ లేదు

అన్నదాతలకు సకాలంలో సూచనలు, సలహాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందితేనే అధిక దిగుబడులు వస్తాయి. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేసే పథకాలు వారి దరిచేరితేనే ప్రయోజనం చేకూరుతుంది. సత్యవేడు నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు అటకెక్కడంతో సాగు ముందుకు సాగడం లేదు. ఫలితంగా అన్నదాతలు వ్యవ'సాయం' అందక అవస్థ పడుతున్నారు.

- ఆర్బీకేల్లో అటకెక్కిన కియోస్క్‌లు
- రైతుసేవా కేంద్రాల్లో అందని సేవలు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజాధనం వృథా
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మరదవాడలో మూతపడిన రైతు భరోసా కేంద్రం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత వ్యవసాయ రంగం కుదేలైంది. అన్నదాతలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేయడానికి గత ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు అటకెక్కడమే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందనే మాటను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల్లో చూపెట్టింది. రైతులు ఉంటున్న గ్రామంలోనే ఆర్బీకే సేవలు అందుబాటులో తెచ్చి, వారి కష్టాలను తీర్చింది. గత ఐదేళ్ల ముందు టీడీపీ పాలనలో రైతన్నలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర వాటి కోసం పడిన కష్టాలు పునరావృతం కాకుండా చేసింది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందుల, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీకే రవాణా సమస్య లేకుండా స్థానికంగానే అందేలా చర్యలు తీసుకుంది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసి, రైతులను సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేలా చొరవచూపింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ సేవల కొనసాగింపులో వివక్ష చూపింది. వైఎస్సార్ సీపీ ముద్ర లేకుండా చేయడానికి ఆ సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్బీకేల లక్ష్యాన్ని నీరుగారింది. దీంతో రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్ సేవలు కొండెక్కాయి. సత్యవేడు నియోజకవర్గంలో 87 రైతు భరోసా కేంద్రాలుండగా ఇప్పుడు ఎక్కడా కియోస్క్ యంత్రాలు పనిచేయకపోవడం రైతాంగానికి శాపంగా పరిణమించింది.

గతంలో కియోస్క్ సేవలిలా...

ఆర్బీకేల్లోని డిజిటల్ ఆధారిత సేవల ద్వారా ఈ మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు సాంకేతికంగా రైతుల అవసరాలకు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, రైతుల పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ల వివరాలు, అక్కడి ధరలు ఇందులో డిస్‌ప్లే అయ్యేవి. దీంతో రైతులకు కచ్చితమైన సమాచారం తెలిసేది. ముఖ్యంగా వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు ఏ సీజన్‌లో ఏ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చో సమాచారం ఇక్కడ లభించేది. నాడు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కియోస్క్ సేవలు కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతల దరికి చేరకుండా పోయాయి.

ఆర్బీకేలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం రాకతో ఆర్‌బీకేలపై నిర్లక్ష్యం పెరిగింది. ఇందులోని సేవలన్నీ మాయమయ్యాయి. సాంకేతిక కారణాలతో ఆయా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. రూ.లక్షల విలువైన ఈ యంత్రాలు ఇప్పుడు దిష్టిబొమ్మలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి బాగున్నా ఇంటర్‌నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. కియోస్క్‌లున్నా రైతులకు మేలు చేయని పరిస్థితి కల్పించినట్లైంది. వీటిపై స్థానిక వ్యవసాయశాఖ అధికారులు సైతం అసలు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కియోస్క్‌ల సేవలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా ఉన్న కియోస్క్ డిజిటల్ యంత్రం



సత్యవేడు నియోజకవర్గంలో ఆర్బీకే వివరాలు

మండలం	ఆర్బీకేలు
పిచ్చాటూరు	10
నాగలాపురం	10
నారాయణవనం	8
వరదయ్యపాళెం	12
సత్యవేడు	14
కేవీబీపురం	19
బీఎన్‌కండ్రిగ	14

మాకు ఎంతగానో ఉపయోగపడేవి



గత ప్రభుత్వంలో ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన అన్ని సేవలు అందేవి. ఇప్పుడు అలాంటి సేవలు, సౌకర్యాలు ఆర్బీకేల్లో (రైతు సేవా కేంద్రాలలో) అందడం లేదు. కి యోస్క్‌లను ఉపయోగించుకుని ఎరువులు, మందులు త దితరాలను పంట సాగుకు ముందుగానే పొందేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం లే దు. ప్రభుత్వం యంత్రాలను మూలన పడేయడం ఏమాత్రం సమంజసం కాదు. మళ్లీ ఉపయోగంలోకి తెస్తే బాగుంటుంది.

– సుధాకర్, రైతు, పెద్ద పాండూరు

సేవలందించడం ప్రభుత్వ బాధ్యత



గతంలో ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సేవలు ఆర్బీకేలోని కియోస్క్‌ల ద్వారా అందేవి. పల్లెల్లోని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు, పెద్ద పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే అందుబాటులో ఉండేవి. వ్యవసాయానికి సంబంధించిన సేవలను అందించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కియోస్క్ యంత్రాలను రైతులకు అందుబాటులోకి తేవాలి.

– మల్లికార్జున్ రెడ్డి, రైతు, సిద్ధాపురం, వరదయ్యపాళెం

కియోస్క్ సేవలను కొనసాగించాలి



కియోస్క్ సేవలను కొనసాగించాలి. ఎరువులు నిల్వలు, ధరలు రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. వ్యవసాయ పథకాలు సకాలంలో అందించేందుకు కియోస్క్ చక్కగా ఉపయోగపడ్డాయి. మండల కేంద్రాలకు వెళ్లకుండా ప్రతి సేవ గ్రామాల్లోనే అందేది. రైతులు కూడా ఆ యంత్రాలను వినియోగించుకునే తీరును తెలుసుకున్నారు. పేద రైతులకు ఎంతగానో ఉపయోగపడే కియోస్క్ సేవలను కొనసాగించాలి.

– శోభన్ యాదవ్, రైతు, పెద్ద పాండూరు

ఇప్పుడు యాప్‌లను వాడుతున్నాం



కియోస్క్‌లను ప్రస్తుతం వినియోగించడం లేదన్నది వాస్తవమే. అయితే ప్రభుత్వం రైతులకు అందించే సేవలు మాత్రం ఎప్పటికప్పుడు అందేలా ప్రత్యామ్నాయ మార్గాల్లో చేపట్టడం జరిగింది. ఇప్పటికే సీఎంఐడీ అనే యాప్ ద్వారా రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను అందిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు యాప్ ద్వారా రైతాంగానికి అన్ని సేవలు అందజేస్తున్నాం.

– సుబ్రమణ్యం, ఏడీఏ, వరదయ్యపాళెం మండలం

రసాభాసగా ప్రజాదర్బార్



అర్జీలు ఇచ్చేందుకు ఎగబడుతున్న ప్రజలు

- పోటెత్తిన అర్జీదారులు
- అసహనానికి గురైన ఎమ్మెల్యే

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రేణిగుంటలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమం రసాభాసగా మారింది. కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఒక్కసారి ప్రజలు అర్జీలు ఇవ్వడానికి వేదికపై రావడంతో ఎమ్మెల్యే అసహనానికి గురయ్యారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నియోజకవర్గంలో చేపడుతున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని ముందుగానే వెల్లడించడంతో మండలంలోని ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు పెద్ద ఎత్తున సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు రావడంతో అప్పటివరకు నిరీక్షించిన ప్రజలు ఒక్కసారిగా వేదిక వద్దకు వచ్చి అర్జీలు ఇచ్చేందుకు ఎగబడ్డారు. పోలీసులు ఎంత సముదాయించిన వీలుగాని పరిస్థితుల్లో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేసి, తన అనుచరులతో అర్జీలను తీసుకొని, అన్ని అర్జీలు పరిశీలించి మీ సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇంటి పట్టాలు, రెవెన్యూ పరమైన సమస్యలు అత్యధికంగా ఎమ్మెల్యే దష్టికి వచ్చాయి.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. రక్షించిన పోలీసులు



సుబ్రహ్మణ్యం రెడ్డి

రేణిగుంట: ఏర్పేడు మండలం బండారుపల్లెకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీనిపై పోలీసు లు తక్షణమే స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడారు. పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం పోలీసు వాట్సాప్ నంబర్‌కు భక్తవత్సలం రెడ్డి అనే వ్యక్తి కాల్ చేసి వారి బంధువు కోడూరు సుబ్రహ్మణ్యంరెడ్డి(59) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి, ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసు కంట్రోల్ రూమ్ సిబ్బంది ఆ విషయంపై పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ సైబర్ పోలీసుల ద్వారా సుబ్రహ్మణ్యంరెడ్డి ఫోన్ లొకేషన్ తెలుసుకుని, ఏర్పేడు బ్లూ కోట్ కానిస్టేబుల్‌కు సమాచారం అందించారు. బ్లూ కోట్ కానిస్టేబుల్ ఫోన్ లొకేషన్ ద్వారా ఆత్మహ త్యకు పాల్పడుతున్న కోడూరు సుబ్రహ్మణ్యం రెడ్డి బండారుపల్లెకు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు చేరుకుని సుబ్రహ్మణ్యం రెడ్డిని రక్షించారు. అతనిని సురక్షితంగా వారి బంధువులకు అప్పగించారు. నిండు ప్రాణాన్ని కాపాడి, కుటుంబ భవిష్యత్తును నిలబెట్టడంలో విశేష ప్రతిభ చూపిన పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సైబర్ క్రైమ్ పోలీసులు, ఏర్పేడు పోలీస్ స్టేషన్ బ్లూ కోట్ కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు అభినందించారు.

మండలమీట్‌లో నిబంధనలకు నీళ్లు

- ఎమ్మెల్యే సాక్షిగా వేదికెక్కిన టీడీపీ నేతలు
- వారించని ఎమ్మెల్యే బొజ్జల
- అర్ధంతరంగా సమావేశం వాయిదా



రేణిగుంట మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు వేదికపై ఆశీనులైన టీడీపీ నేతలు

రేణిగుంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సాక్షిగా నిబంధనలకు నీళ్లు వదిలారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో కనీసం సభలో సభ్యులు కాని వారు వేదికపై కూర్చోవడం.. ఎమ్మెల్యే వారిని ప్రోత్సాహించడంపై సభ్యులు ముక్కున వేలేసుకున్నారు. ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులుగా ఉన్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు. అయితే సమావేశం ప్రారంభమైన కాసేపటికే ఎమ్మెల్యే సమావేశానికి హాజరయ్యారు. ఆయనతో పాటు ఎలాంటి హోదా లేని టీడీపీ నాయకులు సమావేశంలో వేదికపై ఎక్కి దర్జాగా కూర్చున్నారు. మండల స్థాయి అసెంబ్లీగా భావించే మండల సర్వసభ్య సమావేశం సంప్రదాయాలకు తిలోదకాలు వదలడంపై పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా సమావేశానికి అభివృద్ధి పనులను గురించి వివరించారు.

అర్ధంతరంగా ఆగిన సర్వసభ సమావేశం

సర్వసభ సమావేశం నిర్వహించే సమయంలోనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సర్వసభ సమావేశంలో పాల్గొని, అర్ధగంట తర్వాత ఎంపీడీఓ కార్యాలయం ముందు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి వెళ్లారు. అధికారులు సమావేశాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించారు. కానీ ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌లో అధికారులు పాల్గొనాలని పిలవడంతో చేసేదేమీ లేకుండా సర్వసభ సమావేశాన్ని అర్ధంతరంగా వాయిదా వేసి, అధికారులంతా ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు. చేసేది లేక ప్రజాసమస్యలు చెప్పుకుందామని సమావేశానికి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నిరాశగా వెనుతిరిగారు.

వేదికపై టీడీపీ నాయకులు

మండల సర్వసభ సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు టీడీపీ రేణిగుంట మండల అధ్యక్షుడు, మాజీ మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి తదితర టీడీపీ నాయకులు వేదికపై ఎమ్మెల్యేతోపాటు కూర్చోవడంతో ప్రజా ప్రతినిధులు అవాక్కయ్యారు. ఎన్నడూ లేని కొత్త సంప్రదాయాన్ని ఎమ్మెల్యే తీసుకోరావడం ఏమిటని సభ్యులు విమర్శించారు. అధికారులు సైతం వారికి అడ్డు చెప్పలేదు. దీంతో మండల సమావేశం టీడీపీ మీటింగ్‌ని తలపించింది.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు

సత్యవేడు: నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఉదయం నాగాలమ్మ ఆలయాలు, గ్రామ శివార్లలోని పుట్టల వద్దకు ఉపవాసంతో కుటుంబ సమేతంగా వెళ్లి పసుపు, కుంకుమ, పూలతో నాగాలమ్మకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చిమ్మిలి, చలివిడి, బురగుంజు, గుడ్లు, పాలు పుట్టలో పోసి నాగాలమ్మకు నైవేద్యం, కొత్త చీరలు సమర్పించారు. అలాగే సత్యవేడు బాలనాగాలమ్మ పుట్ట వద్ద, మదనంబేడు, ఇరుగుళం, దాసుకుప్పం, పీవీ పురం ప్రాంతాల్లో పుట్ట పూజ చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.



సత్యవేడు: మదనంబేడులో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



శ్రీకాళహస్తిలో పూజలు చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కార్తీక మాసం శుద్ధ చవితి మంగళవారం రోజున నాగుల చవితి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాము పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి, పాలు పోసి, నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక బ్రాహ్మణవీధిలోని నాగాలమ్మ ఆలయంలో మంగళవారం నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని పుట్టకు పూజలు చేసి, పాలు పోశారు. నేతి దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారిని పసుపు, కుంకుమతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని కీళగరం చెరువుకట్టపై, వెత్తలతుడు, తుంబూరు, వెలుతురు కండ్రిగ, స్థానిక పద్మసరస్సుల వద్ద పుట్టలకు మహిళలు ఉదయం నుంచే పసుపు, కుంకులతో పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. స్థానిక పరాశరేశ్వర స్వామి, అగస్త్యేశ్వరస్వామి, పాలమంగళం పాలీశ్వర స్వామి, కైలాసనాథకోనలోని ఆలయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలవ్యాప్తంగా నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుండే అన్ని గ్రామాల్లో నాగాలమ్మ పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వరదయ్యపాళెం కడూరు, సంతవేలూరు, బత్తలవల్లం, కారిపాకం, తొండంబట్టు గ్రామాల్లో పెద్దఎత్తున పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. అనంతరం ఉపవాసాలతో భక్తులు మొక్కులు చెల్లించారు.

నాగశిలలకు ప్రత్యేక అభిషేకాలు

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న రుద్రపాదాల వద్ద నాగశిలలకు ఆలయ పండితుల ఆధ్వర్యంలో మగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. నాగుల చవితి సందర్భంగా ఆలయ రుద్ర పాదాల వద్ద ఉన్న నాగ శిలలకు ఆలయ వేదపండితులు పసుపు, విభూది, పాలు తదితర ద్రవ్యాలతో అభిషేకం చేసి, నైవేద్యం పెట్టి, హారతులిచ్చారు. మహిళలు ఉపవాస దీక్షలతో అధిక సంఖ్య లో అక్కడికి చేరుకుని పూజలు చేశారు. అలాగే పట్టణానికి సమీపంలో అన్ని పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు.







సత్యవేడు: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు, బుచ్చినాయుడుకండ్రిగలో పూజలు చేస్తున్న మహిళలు, నాగలాపురంలో.., వరదయ్యపాళెం: నాగాలమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, నారాయణవనంలో..

క్లుప్తంగా

ఆర్థిక సాయం



వాచర్ వెంకటేష్ కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ కుటుంబానికి పోలీసు, అటవీ సిబ్బంది, అధికారులు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. తొట్టంబేడు మండలం కన్నలి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తి రేంజి ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఎఫ్ఆర్ఓ, శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు, ఫారెస్టు కుటుంబాలు, ఇతరులు కలిసి రూ 2,90,711 ఆర్థికంగా సాయం చేశారు. ఈ మొత్తంలో వెంకటేష్ ఇద్దరి పిల్లల పేరున కొంత మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, మిగిలిన మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ గోపి

సత్యవేడు: ఎన్ఆర్ఈజీఎస్‌లో మంజూరైన 56 సిమెంటు రోడ్లు, రెండు ప్రహరీ నిర్మాణపనులను డిసెంబర్ లోపు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈ టి.గోపి కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులకు నాగలాపురం మండలంలోని నందనం క్వారీ నుంచి ఇసుక తీసుకువచ్చేందుకు జిల్లా అధికారుల అనుమతి ఉందన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు కలసి ఎన్ఆర్ఈజీఎస్ పనులకు ఉచిత ఇసుక అనుమతి పత్రాలు గుత్తేదారులకు అందజేయాలని సూచించారు. అనుమతి పత్రాలు పూరించే పద్ధతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఇబ్రహీం ఖాన్, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా చంద్రశేఖర్



శ్రీకాళహస్తి: కాపునాడు శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా గరికిపాటి చంద్రశేఖర్ బాబుని నియమిస్తూ కాపునాడు జాతీయ అధ్య క్షుడు గల్లా సుబ్రహ్మణ్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గరికపాటి చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తానన్నారు. కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తామన్నారు. అలాగే కాపునాడు పెద్దల సహాయ, సహకారంతో కాపు భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తామన్నారు. అలాగే కాపు యువతకు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

11 నుంచి వెంకన్న తెప్పోత్సవాలు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ, స్థానిక పద్మసరస్సులో రోజూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించే తెప్పోత్సవాలలో తొలిరోజు సీతా లక్ష్మణ సమేత రామచంద్ర మూర్తి, రెండవ రోజు ఆండాళ్ అమ్మవారు, చివరి మూడు రోజులు శ్రీదేవి భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తెప్పపై విహరిస్తారని తెలియజేశారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



వైద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

రేణిగుంట : తమ సమస్యలను పరిష్కరించాలని ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ బి.శివప్రియకు స్థానిక 104 సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టం అవుతుందని వాపోయారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ మొత్తం తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించడంతోపాటు రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల బత్తిరెడ్డి, డ్రైవర్ యోగనంద తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణపై డీఎస్పీ విచారణ



గ్రామస్తులను విచారిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం గ్రామపంచాయతీ కమ్మవారికండ్రిగలో పొలాలలోకి వెళ్లే రోడ్డు విషయమై జరిగిన ఇరు వర్గాల ఘర్షణపై మంగళవారం శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, ఎస్ఐ విశ్వనాథనాయుడు గ్రామంలో విచారణ చేశారు. గ్రామానికి చెందిన మనోహర్‌నాయుడు, మధునాయుడు, కారణిమిట్ట దళితవాడకు చెందిన రమేష్, జేసీబీ డ్రైవర్ వెంకటేష్ ఇదే గ్రామానికి చెందిన ప్రసాద్‌నాయుడు, భువనేశ్వరి పొలాలకు వెళ్లే రోడ్డు గురించి ఘర్షణ పడ్డారు. పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. ప్రసాద్‌నాయుడు, భువనేశ్వరిలకు గాయాలవడంతో హతమార్చేందుకు ప్రయత్నించారని మనోహర్‌నాయుడు, మధునాయుడు, రమేష్, వెంకటేష్‌లపై కేసు నమోదైంది. అలాగే రమేష్‌ను కులం పేరిట ప్రసాద్‌నాయుడు దూషించారని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి డీఎస్పీ గ్రామస్తులను విచారణ చేశారు. కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్‌రెడ్డి

వరదయ్యపాళెం: ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నియోజకవర్గ ఆశావర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఆశావర్కర్లు రాస్తున్న రికార్డులను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఆశావర్కర్ల సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. లేనిపక్షంలో త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సత్యవేడు నియోజకవర్గ ఆశావర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రబాబు, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షురాలు వాణి, మండల యూనియన్ నాయకులు రెడ్డి లత, జ్యోతి, సుకన్య, పుష్పలత, వెంకటమ్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. రైతులకు శాపం



నేల కూలిన విద్యుత్ స్తంభం

- నేల కూలిన విద్యుత్ స్తంభాన్ని మార్చని వైనం
- కరెంటు లేక 120 ఎకరాల్లో ఎండుతున్న వరి పంట
- లబోదిబోమంటున్న రైతన్నలు

బుచ్చినాయుడుకండ్రిగ: గత నెల తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు కనమనంబేడు గ్రామ పొలాలలోని విద్యుత్ స్తంభం నేలకూలడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి కరెంటు సమస్య మూలాన బోరు మోటార్లు పనిచేయకపోవడం సుమారు 120 ఎకరాలలోని వరిపంటకు నీరు పారించని పరిస్థితి మూలాన ఎండిపోతోందని రైతులు లబోదిబోమంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసి 20 రోజులు కావొస్తున్నా స్తంభం మార్చి, కరెంటు సరఫరాను పునరుద్ధరించకపోవడంతో నష్టపోతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.